ప్రజాశక్తి

గురువారం 15 మే 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా





సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు

- హోంమంత్రి అనిత
- ఉయ్యూరు గ్రామీణ పోలీస్‌స్టేషన్‌కు ప్రారంభోత్సవం



పోలీస్‌స్టేషన్‌కు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వంగలపూడి అనిత, చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంఎల్ఎ ప్రసాద్

ప్రజాశక్తి - ఉయ్యూరు : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సైబర్ నేరాల నివారణపై త్వరలో పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం గండిగుంట గ్రామ పరిధిలో నూతనంగా నిర్మించిన ఉయ్యూరు గ్రామీణ పోలీస్‌స్టేషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నేరస్తుల చర్యలను పసిగడుతున్నామని వివరించారు. రాష్ట్రంలో లక్ష ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. త్వరలో నూజివీడు వద్ద పోలీస్ ట్రైనింగ్ అకాడమీ, విజయనగరం జిల్లాలో గ్రాండ్ ట్రైనింగ్ అకాడమీ నిర్మించనున్నట్లు తెలిపారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై అన్ని కోణాల్లో విచారణ జరుగుతోందన్నారు. పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్ మాట్లాడుతూ గండిగుంట గ్రామానికి చెందిన దాత సజ్జా వెంకటేశ్వరావు ఉయ్యూరు కాటూరు రోడ్‌లో పోలీస్ స్టేషన్, తహశీల్దారు, ఎంపిడిఒ కార్యాలయాల నిర్మాణం నిమిత్తం తన 20 సెంట్ల స్థలాన్ని విరాళంగా అందజేశారని తెలిపారు. ఈ స్థలంలో త్వరలో ఎంపిడిఒ, తహశీల్దారు కార్యాలయాలను నిర్మిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్, కష్ణాజిల్లా ఎస్పీ గంగాధరరావు తదితరులు మాట్లాడారు. ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, పలువురు డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలు, టిడిపి మండల అధ్యక్షులు కుటుంబరావు పాల్గొన్నారు. అనంతరం మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు.

త్వరలో బుడమేరు రిటైనింగ్ వాల్ పనులు : మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : త్వరలో బుడమేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. బుడమేరు డైవర్షన్ ఛానల్ అభివృద్ధి పనులను మంత్రి నిమ్మల, మైలవరం ఎంఎల్ఎ వసంత వెంకట కష్ణ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ మొదలయ్యేలోగా బుడమేరుకు పడిన మూడు గండ్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. బుడమేరు డైవర్షన్ కెనాల్ సామర్థ్యాన్ని 37,500 క్యూసెక్కులకు పెంచేలా, పెండింగ్ పనులు పూర్తి చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. బుడమేరు వరద ఎనికేపాడు మీదుగా కొల్లేరు, ఉప్పుటేరు నుండి సముద్రంలో కలిసేలా డిపిఆర్ తయారీ దశలో ఉందన్నారు. బుడమేరు ఓల్డ్ ఛానెల్‌కు సమాంతరంగా, మరో కొత్త ఛానెల్‌ను కూడా 20 వేల క్యూసెక్కుల సామర్ధ్యంతో అభివద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. బుడమేరు వరదల నియంత్రణకు డిజాస్టర్ మేనేజ్మెంట్ కింద కేంద్రం సహకారంతో ముందుకు వెళ్లేలా ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. మున్సిపల్, రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖలను సమన్వయం చేసి ప్రతిపాదన ముఖ్యమంత్రి ముందు ఉంచుతామన్నారు. మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కష్ణ ప్రసాదు మాట్లాడుతూ కొండపల్లి శాంతినగర్, కవులూరు శివారు ప్రాంతాల్లో బుడమేరు డైవర్షన్ ఛానల్ అభివద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. బిడిసి అభివద్ధికి ప్రభుత్వం రూ.39.05 కోట్లు కేటాయించిందన్నారు. దీనిలో బుడమేరు హెడ్ రెగ్యులేటర్ మరమ్మతులకు రూ.1.08 కోట్లు, మిగిలిన పనులకు రూ.37.97 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.



బుడమేరు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంఎల్ఎ వసంత కృష్ణ ప్రసాద్

మెట్రో కారిడార్ల పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడలో ప్రతిపాదిత మెట్రో కారిడార్‌లను ఎఐఐబి ప్రతినిధులు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుంచి గన్నవరం వరకూ ఉన్న 26 కిమీ కారిడార్‌ను ,అలాగే బస్టాండ్ నుంచి పెనమలూరు వరకూ ఉన్న 12 కిమీల కారిడార్‌ను ప్రతినిధులు పరిశీలించారు. ముందుగా ఎఐఐబి బ్యాంకు ప్రతినిధులతో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎమ్‌డి రామకష్టారెడ్డి సమావేశమయ్యారు. విజయవాడ, విశాఖ మెట్రో ప్రాజెక్టులకు అయ్యే వ్యయంలో రూ.12 వేల కోట్లు రుణం అవసరం అవుతుందని అంచనా వేశారు. విశాఖ మెట్రోకు రూ.6100 కోట్లు, విజయవాడ మెట్రోకు రూ.5900 కోట్లు రుణం సమీకరించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రెండు మెట్రో రైల్ ప్రాజెక్టులకు రుణాలు ఇచ్చేందుకు విదేశీ బ్యాంకులు కెఎఫ్‌డబ్ల్యు, ఎఎఫ్‌డి, ఎడిబి, ఎన్‌బిడి, ఎఐఐబి, జైకా, ప్రపంచ బ్యాంకులు ముందుకు వస్తున్నట్లు మెట్రో రైల్ కార్పొరేషన్ ఎమ్‌డి రామకృష్ణారెడ్డి వెల్లడించారు. తక్కువ వడ్డీకి రుణం ఇచ్చే బ్యాంకులతో ఆయన సంప్రదింపులు జరుపుతున్నారు. త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో విదేశీ బ్యాంకుల ప్రతినిధులు చర్చలు జరపనున్నారు.

డిఎస్‌సి అభ్యర్థులకు అన్యాయం చేయొద్దు

- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

ప్రజాశక్తి - తిరువూరు : డిఎస్‌సి అభ్యర్థులకు అన్యాయం చేస్తే సహించేది లేదని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న హెచ్చరించారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు బోసుబొమ్మ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి అభ్యర్థులందరికీ న్యాయం చేయాలని, ఒక జిల్లాకు ఒకే పేపర్ ఉండాలని డిమాండ్ చేశారు. నార్మలైజేషన్ వల్ల అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ పరీక్షను రద్దు చేసి ఆఫ్‌లైన్‌లో పెట్టాలన్నారు. డిఎస్సీ అభ్యర్థుల ప్రిపరేషన్‌కు తగిన సమయం ఇవ్వాలన్నారు. నోటిఫికేషన్ నాటికి కేవలం 45 రోజులు సమయం ఏమాత్రం సరిపోవడం

(మిగతా 2లో)



ధర్నాలో మాట్లాడుతున్న రామన్న

బీచ్ ఉత్సవాలకు వేగంగా ఏర్పాట్లు

- మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశం
- బీచ్‌లో ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ : జూన్ మొదటివారంలో నాలుగు రోజులపాటు మసులా ఫెస్ట్ పేరుతో మంగినపూడి బీచ్ ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం మంగినపూడి బీచ్‌ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న పలు ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తొలుత ప్రవేశ మార్గంలో ఫిలిం ఆర్ట్ డైరెక్టర్ రమణ వంక ఏర్పాటు చేస్తున్న స్వాగత తోరణాలను పరిశీలించారు. తదుపరి థర్మాకోల్‌తో తయారు చేస్తున్న గౌతమ బుద్ధుడు, ఆక్టోపస్, డాల్ఫిన్, ఎండ్రకాయ, నక్షత్ర చేప, వివిధ రకాల చేపలు, తాబేలు, శంఖము, తదితర సముద్ర జీవులు, పాండురంగ స్వామి ఆకారాలతో బొమ్మలను పరిశీలించారు. బీచ్‌లో ప్రధాన రహదారి వెడల్పు చేసి మధ్యలో ఒక కూడలి ఏర్పాటు చేసి అక్కడి నుండి హెలిపాడ్ వరకు రహదారి నిర్మించాలని సూచించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా అత్యద్భుతమైన పర్యాటక ప్రాంతంగా మచిలీపట్నం బీచ్‌ను తీర్చిదిద్దుతామన్నారు. ఈపర్యటనలో మంత్రి వెంట మచిలీపట్నం ఆర్డిఓ కే.స్వాతి, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, తహశీల్దార్లు హరినాథ్, నాగ భూషణం పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

19న 'దేశ సమాఖ్య వ్యవస్థ - ఎదురవుతున్న సవాళ్ళు'పై స్మారకోపన్యాసం

హాజరుకానున్న మాడభూషి శ్రీధర్

ప్రజాశక్తి - విజయవాడ : దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తొలి పార్లమెంటు ప్రతిపక్షనేత, స్వాతంత్ర సమరయోధుడు అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఈనెల 19వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు విజయవాడ గవర్నరుపేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) ఆడిటోరియంలో స్మారకోపన్యాసం ఏర్పాటు చేసినట్లు ఎంబివికె మేనేజ్‌మెంట్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా 'భారతదేశ ఫెడరల్ వ్యవస్థ – ఎదురవుతున్న సవాళ్ళు' అంశంపై సీనియర్ పాత్రికేయుడు, ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది, న్యాయశాస్త్ర ఆచార్యులు, కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ స్మారకోపన్యాసం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంబివికె ట్రస్టు చైర్మన్ పి.మధు, ట్రస్టు కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు పాల్గొంటారు.



ఎంబివికె ఆధ్వర్యాన ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - విజయవాడ : మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం, బుధవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఎంబివికెలో గత నెల రోజులుగా జరుగుతున్న శిక్షణా శిబిరాలలో పాల్గొంటున్న దాదాపు 100 మంది విద్యార్థులకు మాక్సవిజన్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో కంటి పరీక్షలు నిర్వహించారు. ఎంబివికె ఇన్చార్జి బి.ఆర్.తులసీరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ఫోన్లకు, టివిలకు ఎడిక్ట్ అవుతున్న పిల్లలకు చిన్న వయస్సులోనే కళ్ళజోళ్ళు పెట్టుకునే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కంటి సమస్యలు రాకుండా సరైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంబివికె మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు టి.క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సమ్మర్ క్యాంప్ ముగింపు సభ

ప్రజాశక్తి - విజయవాడ : జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో విజయవాడలో ఐదు ప్రాంతాల్లో నిర్వహించిన సమ్మర్ క్యాంపులు ముగింపు సందర్భంగా గురువారం సాయంత్రం 6 గంటలకు విజయవాడ గవర్నరుపేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియంలో శిక్షణ పొందిన పిల్లలతో ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లున్న వేదిక నాయకులు జి.నారాయణరావు తెలిపారు. సమ్మర్ క్యాంపుల్లో పిల్లలకు డ్యాన్సు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు.

వంశీ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

ప్రజాశక్తి - విజయవాడ : గన్నవరంలోని టిడిపి కార్యాలయంపై దాడి కేసు నిందితుడిగా ఉన్న మాజీ ఎంఎల్ఎ వల్లభనేని వంశీమోహన్ బెయిల్ పిటిషన్‌పై సిఐడి కోర్టులో బుధవారం వాదనలు ముగిశాయి. ఈ దాడి కేసులో వల్లభనేని వంశీ ఏ-71 నిందితుడిగా ఉన్నారు. తీర్పును కోర్టు రిజర్వు చేసింది. ఈనెల 16వ తేదీన తీర్పును వెలువరించనుంది.

మార్గదర్శకుల ఎంపికకు చర్యలు : కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - విజయవాడ : బంగారు కుటుంబాల మార్గదర్శకుల ఎంపికకు ప్రత్యేకంగా రూపొందించిన ఫార్మాట్లో పూర్తి వివరాలను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ భాగస్వామ్యం) అమలులో భాగంగా బంగారు కుటుంబం- మార్గదర్శి, కుటుంబ సమగ్ర సమాచార వివరాల నమోదుపై బుధవారం ఎంపీడీవోలు, నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర హెచ్ఎం, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలోని 604 సచివాలయాల పరిధిలో 86వేల 398 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. వీటిలో నగరపాలక సంస్థ పరిధిలోని 286 సచివాలయాల పరిధిలో 46వేల 169 కుటుంబాలు ఉన్నాయన్నారు.

డిఎస్‌సి అభ్యర్థులకు అన్యాయం చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

లేదన్నారు. అభ్యర్థుల చేస్తున్న అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున అభ్యర్థులకు వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని, డైట్, బీఈడి చేసి టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు డీఎస్సీ అవకాశం కల్పించాలని, ఓపెన్ విద్య చదివిన వారికి డీఎస్సీలో అవకాశం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. డిగ్రీ బీఎస్సీలో సిఎస్ చదివిన వారికి ఎస్ఎ పిఎస్ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారుల అనాలోచితమైన నిర్ణయాలు వల్ల అభ్యర్థులను బలి చేయడం తగదన్నారు. పీఈటీ పోస్టులు సంఖ్య పెంచాల న్నారు. ఇప్పటికే డీఎస్సీ అభ్యర్థులకు టెక్నికల్ సమస్య వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి గురౌతున్నారని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి వీటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో డివైఎఫ్ఐ తిరువూరు కార్యదర్శి సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నాగరాజు, సిఐటియు నాయకులు బి.వెంక టేశ్వరరావు, డివైఎఫ్ఐ నాయకులు, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై దృష్టి పెట్టండి

అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : జాతీయ ఉపాధి హామి పథకం ద్వారా శ్రామికులకు 80 లక్షల పనిదినాలను కల్పించాలనే లక్ష్యాన్ని సాధించడంపై ప్రత్యేక దష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చడంలో అలసత్వం వహించొద్దని అధికారులను హెచ్చరించారు. ఉపాధి హామి పథకం ద్వారా జిల్లాలో చేపడుతున్న పనుల ప్రగతి పై బుధవారం నీటి యాజమాన్య సంస్థ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, మండలాభివద్ధి అధికారులు, పంచాయితీరాజ్ రూరల్ డవలప్‌మెంట్ అధికారులతో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు కేవలం 13.40 లక్షల పని దినాలను మాత్రమే కల్పించడం పట్ల ఆసంతప్తి వ్యక్తం చేశారు. వీడియోకాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులు ఎ. రాము, పి. బాలాజీ, జి. జ్యోతి, విజయకుమారి పాల్గొన్నారు.



మతతత్వ కార్పొరేట్ శక్తులను అడ్డుకోవాలి

'మార్క్సిస్ట్' ఎడిటర్ వెంకట్రావు



సదస్సులో మాట్లాడుతున్న వెంకట్రావు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: మతతత్వ కార్పొరేట్ శక్తులను అడ్డుకోవాలని మార్క్సిస్ట్ సైద్ధాంతిక మాసపత్రిక ఎడిటర్ ఎస్.వెంకట్రావు అన్నారు. బుధవారం బుట్టాయిపేట మహాత్మ జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో 'ఫాసిజం నాడు - నేడు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో లేని శత్రువుని సృష్టించడం నయా ఫాసిజంగా అభివర్ణించారు. నేడు దేశంలో ఒకే మతం, ఒకే భాష, ఒకే ప్రభుత్వం, ఒకే ఎన్నిక తదితర నినాదాలు ముందుకు వస్తున్నాయన్నారు. ఇది నయా ఫాసిజంకు ఉదాహరణ అని చెప్పారు. నయా ఉదార ఆర్థిక విధానాల వల్ల ప్రపంచ దేశాల మొత్తం అప్పులపైనే నడుస్తున్నాయన్నారు. దేశంలో పెట్టుబడిదారీ వర్గాల్లో నెలకొన్న సంక్షోభాన్ని అంతం చేయడానికి, ప్రజల్లో ఉన్న అసంతృప్తిని అణిచివేయడానికి బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఫాసిజాన్ని ఆయుధంగా వాడుతోందన్నారు. ఎన్నికల కమిషన్ లాంటి వ్యవస్థను నిర్వీర్యం చేయడం, ప్రభుత్వ వ్యవస్థలను జేబు సంస్థలుగా మార్చుకొని ఈడీ దాడులు జరపడం, ఎదిరించిన వాళ్లను వివిధ కేసుల రూపంలో జైళ్లలో నెట్టడం బిజెపికి నిత్యకృత్యం అయిపోయిందన్నారు. బీజేపీ వ్యతిరేక వార్తలు రాస్తుందని ఎన్‌డి టీవీ యాజమాన్యాన్ని మార్చేసిన ఘనత మోడీకే దక్కిందన్నారు. ఇవాళ దేశం మొత్తం మోడీ మీడియా తప్పితే వేరేది లేదన్నారు. తెలుగు మీడియా రంగంలో చూసినా కార్పొరేట్ల పెట్టుబడులు పెరిగిపోయి వాటికి మోడీ భజన చేయడమే సరిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో పలువురు అరెస్ట్

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్

జిల్లా సరోజన ఆస్పత్రి ప్రాంగణంలో ఘర్షణలకు పాల్పడిన సంఘటనలో పోలీస్ విచారణ అనంతరం ఇరు వర్గాలను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు మచిలీపట్నం డిఎస్పి సిహెచ్ రాజా తెలియజేశారు. పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... బలరాముని పేట లో రెండు వర్గాల కు సంబంధించిన కొమిరి శేఖర్, ఉప్పు మణి మరి కొంతమంది, మరో వర్గానికి చెందిన తన్నీరు రాజేష్, గుంజ బిక్షం, రమణ మరి కొంతమంది మూడు రోజుల క్రితం ఒకరి పై ఒకరు దాడి చేసుకుని గవర్నమెంట్ హాస్పిటల్ లో గాయాలతో అడ్మిట్ అయ్యారు. వారిని పరామర్శించడానికి వచ్చిన ఇరువర్గాల అనుచరులు హాస్పిటల్ ప్రాంగణంలో మరలా దాడి చేసికుని, ఒకవర్గం వెళ్లిపోవుచుండగా మరొక వర్గం దాడి చేసి చంపుటకు ప్రయత్నించిన విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు ఇరు వర్గాలపై కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు విచారణ జరిపి నిందితులను అరెస్ట్ చేసి కోర్టు ముందు ప్రవేశపెట్టగా వారిని రిమాండ్‌కి పంపించినట్లు తెలిపారు.

సుందరీకరణ పనులు వేగవంతం : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం: జాతీయ రహదారి డివైడర్, ఫుట్‌పాత్‌ల సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. సుందరికరణ పనుల ప్రగతి పై విజయవాడ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో బుధవారం మధ్యాహ్నం సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వెంకట్రావ్ మాట్లాడుతూ అమరావతి రాకపోకలు సాగించేందుకు అందుబాటులో ఉన్న ఏకైక విమానాశ్రయం గన్నవరం కావటంతో తరచూ పారిశ్రామికవేత్తలు, విఐపిలు వస్తున్నందున సుందరికరణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. డివైడర్ పై మొక్కలు లేని చోట మొక్కలు నాటాలని, పుట్ పాత్ లపై కుండీలు ఏర్పాటు చేసి వాటిలో మొక్కలు పెట్టాలని సూచించారు. డివైడర్ లకు ఆకర్షణీయమైన రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గన్నవరం (హనుమాన్‌జంక్షన్): విద్యుత్ ప్రమాద మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో నష్టపరిహారం అందించారు. బాపులపాడు మండలం బండారుగూడెం గ్రామానికి చెందిన మరీదు గోవిందులు (33) జనవరి 12వ తేదీ విద్యుత్ షాక్ గురై ప్రాణాలు కోల్పోయాడు. గోవిందులుకు భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబ దుస్థితిని బండారు గూడెం గ్రామ అధ్యక్షులు కొండేటి నాగరాజు ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన యార్లగడ్డ విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. విద్యుత్ శాఖ తరపున రూ.5 లక్షల రూపాయల పరిహారాన్ని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.



రైతు భరోసా అమలు చేయాలి

ప్రజాశక్తి-గన్నవరం: ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా రూ.20 వేలు ఒకేసారి రైతుల ఖాతాలో జమ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు కొలుసు శ్రీమన్నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఉద్దేశంతో ఏడాదికి 20 వేలు రైతు భరోసా కింద ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేశారన్నారు. ప్రస్తుతం ఆ నగదు మూడుసార్లుగా రైతుల ఖాతాలో జమ చేస్తామని ప్రభుత్వం అంటుందని, ఈ విధంగా చేయడం వల్ల రైతులకు వ్యవసాయ అవసరాలు తీరమన్నారు. ఒకేసారి మొత్తం నగదు రైతుల ఖాతాలో వేస్తే వ్యవసాయం చేసుకోవడానికి ఉపయోగపడు తుందన్నారు. మరోవైపు బ్యాంకులో కూడా రైతులకు పూర్తిస్థాయిలో రుణాలు ఇవ్వడం లేదని, దీనితో వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. కౌలు, పేద రైతుల పరిస్థితి మరియు దయనీయంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో జూన్ నెలలో వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతుంది కాబట్టి ముందుగానే రైతులకు రైతు భరోసా అమౌంట్ చెల్లించాలని కోరారు. అదేవిధంగా బ్యాంకులో కూడా సకాలంలో రుణాలు ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు.

రైతాంగాన్ని ఆదుకోండి

రైతు, కౌలురైతు సంఘాల వినతి



వినతిపత్రం ఇస్తున్న రైతు, కౌలురైతు సంఘాల నేతలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతూ ఏపీ రైతు, కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా కమిటీల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి కె చంద్రశేఖరరావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సంవత్సరం రైతులు, కౌలు రైతులు రబీకి అపరాలు ముఖ్యంగా సాగుచేయడం జరిగిందని. కేంద్ర ప్రభుత్వం క్వింటా మినుములు ధర 7400 నిర్ణయించినప్పటికీ వ్యాపారులు ఏడు వేల రూపాయలకే కొనుగోలు చేయడం జరుగుతుందని దీనివల్ల రైతులు, కవులు రైతులు దోపిడీకి గురవుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రతి మండలంలో కొనుగోలు కేంద్రాలను రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీ పూడికలు తీయక పోవడం వల్ల ఆక్వా రైతుల కూడా తీవ్రంగా నష్టానికి గురవుతున్నారు. కాబట్టి వెంటనే తీయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి నుండి కోనుగోలు చేసి మినుములు, వరి, ఆక్వా రైతులను ఆదుకోవాలన్నారు. కృష్ణాజిల్లాలో బుడమేరు, చంద్రయ్య డ్రెయిన్, అయినంపూడి అండర్ డ్రైన్, గుడ్లవల్లేరు డ్రైన్ మరియు తదితర మేజర్ మైనర్ డ్రైన్లను పూడికలు వెంటనే తీయించి పంటలను ముంపు బారిన పడకుండా రక్షించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోసూరి శివ నాగేంద్రం ,గౌరిశెట్టి నాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు ఉన్నారు.

శివారు గ్రామాలకు తాగునీరందించాలి : సిపిఎం

ప్రజాశక్తి-మొవ్వ: ఐలూరు నుండి మొవ్వ మండలం శివారు గ్రామాలకు ప్రజలకు సరిపడా తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు తెలిపారు. మండలంలో చినముత్తేవి, అవిరిపూడి, నిడుమోలు లాకుల వద్ద పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడి తాగునీరు వృధాగా పోతుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి లీకేజీలను సరిచేసి శివారు గ్రామాలకు తాగునీరు అందించాలని కోరారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి: ప్రభుత్వం పశు పోషకులకు విశేష ప్రోత్సాహం అందిస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. బుధవారం చల్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పశు పోషకులకు యాభై శాతం సబ్సిడీపై సమీకృత దాణా పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.1,110 విలువ కలిగిన యాభై కిలోల దాణాను రూ.555కే అందిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పశు పోషకుల కోసం సబ్సిడీపై గోకులాలు, నీటి తొట్టెలు నిర్మించినట్లు తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగమైన పశు పోషణను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం విశేష కషి చేస్తోందన్నారు. వ్యవసాయ ఆధారిత నియోజకవర్గం కావటంతో ఈ ప్రాంతంలో రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పంట కాలువలు, డ్రైనేజీలు మరమ్మత్తులు చేయించినట్లు తెలిపారు. చల్లపల్లి సబ్ డివిజన్ పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నల్లూరి వెంకట భార్గవ మాట్లాడుతూ భారత్ పశు ధన్ యాప్ లో నమోదై, తెల్ల రేషన్ కార్డు కలిగిన పశు పోషకులకు మాత్రమే ఈ దాణా సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. చల్లపల్లి మండలంలో జనరల్ కేటగిరికి పది వేల కిలోలు, ఎస్సీ కేటగిరికి 6,300 కిలోలు కేటాయించినట్లు తెలిపారు. మోపిదేవి మండలంలో జనరల్ కేటగిరికి తొమ్మిది వేల కిలోలు, ఎస్సీ కేటగిరికి 6,450 కిలోలు కేటాయించినట్లు వివరించారు. సబ్సిడీ దాణా అవసరమైన పశు పోషకులు రైతు సేవా కేంద్రాల్లో, పశు వైద్యాధికారి వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, టీడీపీ సీనియర్ నాయకులు సజ్జా చలపతిరావు, ఎంపీటీసీ సభ్యులు మాలెంపాటి శ్రీనివాసరావు, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ నబీఘోరీ, టీడీపీ నాయకులు రావి చంద్రశేఖర్ (చిట్టి), డాక్టర్ మనోజ్, డాక్టర్ నందకిషోర్, జనసేన టౌన్ అధ్యక్షులు బొందలపాటి వీరబాబు, గోళ్ళ ప్రసాద్, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పమిడిముక్కలలో...

గూడూరు: పాడి పరిశ్రమ ప్రగతికి ప్రోత్సాహంగా గూడూరు మండలంలోని గూడూరు పశువైద్యశాల నందు బుధవారం 50 శాతం రాయితీపై పశువుల దాణా పంపిణీ చేశారు. డిసి చైర్మన్ పోతన స్వామి పాల్గొని పాడి రైతులకు దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు ప్రభుత్వం అందించే పథకాలని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువర్ధక శాఖ ఏడి కొనకళ్ల బాబురావు, సర్పంచ్ లింగం సులోచన రాణి, కూటమి నాయకులు దాసరి ఉమా సాయిరాం, ఎన్ ఏ బేగ్, పోతన రామోజీ, గోపి నాగబాబు, బాసం శెట్టి విజయ్, డాక్టర్ విజయకుమార్, పడి రైతులు తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో...

పమిడిముక్కల: రైతుల జీవనాధారం పశువులేనని కపిలేశ్వరపురం పశు వైద్యాధికారి వెంకటేష్ అన్నారు. మండలంలోని కపిలేశ్వరపురం గ్రామంలో పశు వైద్య శాల వద్ద పశువులకు మేత 50 శాతం సబ్సిడీపై అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు వ్యాధి నిరోధక టీకాలు గొర్రెలకు నిరోధక టీకాలు కోళ్లకు వైద్య సదుపాయాలు నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాబి, కొల్లిపర వెంకటేశ్వరరావు, చిగురుపాటి జగదీష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


ఒంగోలు గిత్తల పోషణకు సాయం

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం గ్రామానికి చెందిన కాసర్నేని రాజాకు చెందిన ఒంగోలు గిత్తలు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో జరిగిన ఎడ్ల బల ప్రదర్శనలో గెలుపొంది గన్నవరానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టాయి. అయితే ఇప్పుడు వయో భారం వల్ల నడవలేని స్థితిలో ఎడ్లు ఉండటం వల్ల వాటి పోషణార్ధం కొయ్యగూరపాడుకు చెందిన పిడికిటి రత్నప్రసాద్ (నాని) రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని మల్లంపల్లి సాంబశివరావు, కాసర్నేని శ్రీను చేతుల మీదుగా బుధవారం అందజేశారు



చర్చి వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఉంగుటూరు: ప్రజలంతా ఐక్యతా భావంతో మెలగాలని రెవరెండ్ ఫాదర్ అవినాష్ అన్నారు. బుధవారం మండలంలోని తుట్టగుంట గ్రామంలో గల పునీత జోజిప్ప (ఆర్‌సిఎం) దేవాలయం మొదటి వార్షికోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. ఫాదర్ అవినాష్ పరిశుద్ధ దివ్య పూజ బలిని నిర్వహించారు. పెద్ద ఆవుటపల్లి విచారణ గురువులు అభిలాష గోపు మాట్లాడుతూ అతి చిన్న గ్రామమైన తుట్టగుంటలో ఇంతటి ఆలయ నిర్మాణం చేయడం అనేది గ్రామ ఐక్యతతోనే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ఏసు పాదం, ఫాదర్ సుధీర్, మాజీ సర్పంచ్ రాణి, గుడిసె రాయప్ప, నిర్మల రాజు తదితరులు పాల్గొన్నారు.



రోడ్లపై గుంతలు లేకుండా చర్యలు

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని మిల్క్ కాలనీ క్రాంబే రోడ్ సింగ్‌నగర్ పరిసర ప్రాంతాలను బుదవారం విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రోడ్ పైన గుంతలను ఎప్పటికప్పుడు సచివాలయం సిబ్బంది తమతమ సచివాలయం పరిధిలో పరిశీలించి, చర్యలు తీసుకుంటూ రోడ్ల పైన ఎటువంటి గుంతలు లేకుండా చూసుకోవాలని అన్నారు. సింగ్‌నగర్ ఫైర్ స్టేషన్ వద్ద ఉన్న పార్కులో ప్రవేశ ద్వారాన్ని ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు అందించే విధంగా పార్కులో మొక్కలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఇన్చార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ కష్ణ నాయక్, చీఫ్ సిటీ ప్లానర్



సిబ్బందికి అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

సంజయ్ రత్నకుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ : వీధి వ్యాపారస్తుల సర్వే మంగళవారం నుండి జరుగుతోందని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. 2018 సర్వే ప్రకారం 17,282 వీధి వ్యాపారులు ఉన్నారని తెలిపారు. నగరంలోని 286 సచివాలయాల పరిధిలో ఉన్న 286 సంక్షేమ కార్యదర్శులు ఎన్యూమరేటర్లుగా, ఆరుగురు సూపర్వైజర్ల ఆధ్వర్యంలో ముగ్గురు జోనల్ కమిషనర్ల పర్యవేక్షణలో సర్వేను వెండర్ కనెక్టర్ యాప్ ద్వారా చేస్తున్నారని తెలిపారు. వివిధ విధి వ్యాపారస్తుల అసోసియేషన్ సభ్యులకు, ప్రజా ప్రతినిధులకు, ఆర్పీలకు, స్వయం సహాయక సంఘాలకు, వీధి వ్యాపారస్తుల సర్వే గురించి సమాచారం అందించారని



వీధి వ్యాపారుల నుంచి వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

తెలిపారు. సర్వే ముగిసిన తర్వాత గుర్తింపు కార్డులు జారీ చేస్తామని తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తున్న 'ఠాగూర్'

ప్రజాశక్తి - విజయవాడ : గవర్నరుపేట ఎంజి రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా పేపర్ క్రాఫ్ట్ వర్క్, పెయింటింగ్‌పై, స్వాతి పూర్ణిమ, గణితంలో మెలుకువలను సుస్మిత టీచర్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు చాలా ఆసక్తితో నేర్చుకుంటున్నారు. కథలు చెప్పడం, విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, కేరమ్స్ ఆడించడం వంటివి చేస్తున్నారు. ఈ



కార్యక్రమాల్లో గ్రంథాలయ అధికారి కె.నాగరాజు, సిబ్బంది జి.ఉమారాణి, కె.రాంబాబు, పీవీవి ఫణిబాబు పాల్గొంటున్నారు.

వీధులను జోన్లు వారీగా విభజించండి

చీఫ్ సిటీ ప్లానర్ రత్నకుమార్ ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : నగర వీధులను జోన్ల వారీగా విభజించాలని చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ అన్నారు. విఎంసి ప్రధాన కార్యాలయం నూతన భవనంలోని మీటింగ్ హాల్‌లో ఆయన బుధవారం పట్టణ ప్రణాళిక సిబ్బంది, ప్లానింగ్ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చీఫ్ సిటీ ప్లానర్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ ప్రకారం నిర్మాణం జరుగుతున్న ప్రతి భవనానికీ కచ్చితంగా గ్రీన్ మ్యాట్ ఉండాలని, కన్స్ట్రక్షన్ అండ్ డెమోలేషన్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, సెంట్రల్ మీడియన్లో మెయిన్ రోడ్లలో ఫ్లెక్సీలు బ్యానర్లు పోస్టర్లు ఉంటే వెంటనే తొలగించాలని అన్నారు. వీధి



వ్యాపారుల చట్టం ప్రకారం ఉన్న రెడ్ జోన్, యంబర్ జోన్, గ్రీన్ జోన్లను గుర్తించేందుకు వీధులను జోన్లు వారీగా విభజించి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు మోహన్ బాబు, రాంబాబు, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్లు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై వాటర్ వర్క్స్ ఎఇకి వినతి

ప్రజాశక్తి - విజయవాడ : కృష్ణలంక 22 డివిజన్‌తో పాటు ఇతర డివిజన్లలో కూడా తాగునీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రక్షిత మంచినీటిని సక్రమంగా అందించడానికి చర్యలు తీసుకోవాలని సిపిఎం తూర్పు సిటీ కమిటీ కార్యదర్శి పి.కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల చిన్నారావు కోరారు. ఈ మేరకు వారు తూర్పు నియోజకవర్గం కృష్ణలంక ఏరియా వాటర్ వర్క్స్ అసిస్టెంట్ ఇంజినీర్ (ఎ.ఇ) నాగసాయికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ, చిన్నారావు మాట్లాడుతూ రక్షిత మంచినీరు లేక భ్రమరాంభపురంతో పాటు కృష్ణలంకలోని పలు డివిజన్ల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. హెడ్ వాటర్ వర్క్స్ నుంచి కృష్ణలంక, రాణిగారితోట, ఇతర ప్రాంతాలకు కృష్ణా వాటర్ రక్షిత మంచినీటి సరఫరా కోసం జరుగుతున్న పనులు ఏళ్లు గడుస్తున్నా ఫలితం ఉండటం లేదని అన్నారు. మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణ పనులు చాలా ఆలస్యంగా జరుగుతున్నాయన్నారు. భ్రమరాంభపురం దోబిఖానా సెంటర్ నుంచి మోటార్ల ద్వారా భూగర్భజలాన్ని పంపింగ్ చేసి, శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తున్నా, సరిగా శుద్ధి లేక,



మురుగునీటినే సరఫరా చేస్తున్నారని అన్నారు. 22వ డివిజన్‌లోని అన్నమ్మ తల్లిగుడి సెంటర్, ఆయిల్ కొట్టు రోడ్డు, సతీష్ రోడ్డు ఏరియాల్లో డ్రెయిన్ల పక్కగానే మంచినీటి పైప్‌లైన్లు వెళ్తున్నాయని, లీకేజీల వల్ల మంచినీటిలో మురుగునీటిని కలిసి, దుర్వాసన వస్తున్నాయని, అయినా వీటినే సంబంధిత అధికారులు ఈ ప్రాంత వాసులకు సరఫరా చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.తాండవ కృష్ణ, తూలుగూ సూరిబాబు, ఎస్.బాపనయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో పుస్తక పఠనం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా బుధవారం మొదటిగా విద్యార్థులకు పుస్తక పఠనం చేయించారు. అనంతరం ఉపాధ్యాయుడు పర్చా లక్ష్మణరావు విద్యార్థులకు జాతీయ పతాకంలోని మూడు రంగులు కాషాయం, తెలుపు, ఆకుపచ్చ విశిష్టత, జాతీయ పతాకంలో మధ్యలోని అశోక ధర్మచక్రం గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులచే జాతీయ పతాకాలతో విద్యార్థులు చేత పట్టుకొని పాట పాడుతూ అభినయం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆలేటి ప్రభ గెంటేల శకుంతలమ్మ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ జిడివి.ప్రసాద్, కవి ఉపాధ్యాయుడు దోసపాటి నాగేశ్వరరావు గ్రంథాలయం సిబ్బంది శ్యామల, రమేష్, రాము పాల్గొన్నారు.

క్రీడాకారులకు అల్పాహారం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని స్థానిక బాయ్స్ హైస్కూల్‌లో కెడిసిఎ, బివి.సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నెట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ క్రికెట్ క్యాంప్‌లో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించే ఇలాంటి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని తద్వారా శారీరకంగా బలంగా ఉంటూ మానసికంగా కూడా దృఢంగా ఉండే అవకాశం ఉందని ఉచిత క్రికెట్ క్యాంపు నిర్వహిస్తూ పిల్లల్లో క్రికెట్ నైపుణ్యం ప్రోత్సహిస్తున్న కెడిసిఎ, బివి.సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ నిమ్మల రాజేంద్రను ప్రత్యేకంగా అభినందించారు. ఎన్నో సంవత్సరాలుగా జగ్గయ్యపేట పట్టణంలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత కోచింగ్‌ను అందజేస్తూ ఎంతోమంది క్రీడాకారులను తయారు చేస్తున్న రాజేంద్రకు జగ్గయ్యపేట పట్టణం రుణపడి ఉంటుందన్నారు. ఇప్పటికే ఇక్కడి క్రీడాకారులు రాష్ట్రస్థాయి వరకు పోటీలో పాల్గొంటున్నారని భవిష్యత్తులో దేశ స్థాయికి ఎదగాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో బి.వి.సుధీర్, మీసాల మనోజ్, గొల్లపూడి మహేష పాల్గొన్నారు.

చిత్రలేఖనం, బొమ్మలు గీయడంపై శిక్షణ

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని గ్రంథాలయ అధికారి పద్మ తెలిపారు. బుధవారం చిత్రలేఖనంలో పుస్తకం బొమ్మ ఎలా వేయాలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు విద్యార్థులకు నేర్పించారని తెలిపారు. విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, కొన్ని గజిబిజి పదాలను బోర్డుపై రాసి వాటికి సరైన జోడి పదాలు రాయించడం, విద్యార్థులతో కథలు చెప్పించడంతో పాటు సరదా ఆట ఆడించినట్లు ఆమె వెల్లడించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి - భవానీపురం :
భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవించి అమ్మేవారిపై గట్టి నిఘా ఉంచామని భవానీపురం సిఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం సిఐ మీడియాతో మాట్లాడుతూ అక్బర్ బాషా అనే వ్యక్తి గంజాయి అమ్ముతున్నట్టు సమాచారం అందింది. ఇతనిపై గతంలో ఐదు గంజాయి కేసులు నమోదు కావడంతో ఇతనిపై మొత్తం 31 కేసులు నమోదయ్యాయని, భవానీపురం పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉందని అన్నారు. అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో పిట్ ఎన్.డి.పి.ఎస్. యాక్టు ప్రకారం అదుపులకు తీసుకుని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. గంజాయి సేవించేవారి మీద, విక్రయించేవారి మీదా నిఘా పెట్టామని సిఐ తెలిపారు.



వివరాలు తెలుపుతున్నసిఐ ఉమామహేశ్వరరావు

ఎయిడ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ ట్రక్కర్స్ ప్రాజెక్టు, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హెచ్‌ఐవిపై అవగాహన కలిగించేందుకు జానపద కళాజాతర ప్రచార కార్యక్రమం విజయవాడలోని ఆటోనగర్‌లో నిర్వహించారు. నెలరోజులపాటు రోజుకొక ప్రాంతంలో కళాజాతా నిర్వహించి ప్రజలకు ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తామని అడిషనల్ డిస్ట్రిక్ట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషారాణి తెలిపారు. ఏపీ శాక్స్ ప్రాజెక్టు అధికారి మలేశ్వరరావు, ట్రక్కర్స్ ప్రాజెక్టు మేనేజర్ వి.వి.సాంబశివరావు, ఏపీ శాక్స్ ఔట్ రీచ్ సిబ్బంది రాయప్ప, ప్రసాద్, శేషు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



దుర్గాభవానీ ఆలయం పునర్నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - భవానీ పురం : పున్నమి ఘాట్‌లో దుర్గాభవాని ఆలయం పునర్నిర్మాణం దుర్గ భవాని విగ్రహం, సాయిబాబా విగ్రహానికి సుమారు రూ.3లక్షల 1000లు మూడు లక్షల వెయ్యి రూపాయలు విరాళంను బుధవారం పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ (సత్యం) అందజేశారు.

సర్పంచ్ పుల్లారావుకు నివాళి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని మల్కాపురం గ్రామంలో వైసిపి గ్రామ సర్పంచ్ అంబోజి పుల్లారావు (జాన్) దశదిన కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుల్లారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బూడిద నరసింహారావు, వైస్ ప్రెసిడెంట్ అంబోజి శ్రీను, అంబోజి సత్యానందం, జుజ్జువరపు వెంకట్రావు, నివాళులు అర్పించారు.

హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, మల్లేశ్వర మహా మండపం 6వ అంతస్తులో నిర్వహించిన యాత్రికులు సమర్పించిన కానుకలు, మొక్కుబడుల హుండీ లెక్కింపు సందర్భంగా 23 రోజులకు రూ.3.73.37.549లు నగదు రూపంలో, 420 గ్రాముల బంగారం, 7 కేజీల 20 గ్రాముల వెండి రూపంలో లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కలెక్టర్ వి.కె.శీనానాయక్ బుధవారం తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమం ఈ ఓ పర్యవేక్షించారు. దేవదాయ శాఖసిబ్బంది,వన్ టౌన్ పోలీసులు, ఎస్.పి.ఎఫ్ పోలీసులు హుండీల లెక్కింపులో పాల్గొన్నారు.





పోరంకిలో ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు


గుడివాడలో సమ్మె నోటీసు అందజేస్తున్న సిఐటియు నాయకులు

సమ్మె జయప్రదం కోరుతూ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-కంకిపాడు: ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ పోరంకిలోని సిఐటియు కార్యాలయం నుంచి బైక్ ర్యాలీని పెనమలూరు మండలం సిఐటియు కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు బుధవారం ప్రారంభించారు. ర్యాలీ పోరంకి సెంటర్ మీదుగా పెనమలూరు సెంటర్, తాడిగడప సెంటర్, కామినేని హాస్పటల్ రోడ్డు మీదుగా కానూరు కొత్త ఆటోనగర్‌లో కార్మికులకు కరపత్రాలు పంచుతూ సాగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్‌కె ఖాసిం, ఏడుకొండలు, దాసరి డేవిడ్, వెంకటరెడ్డి, ఆర్.వేణు, సిహెచ్.దుర్గాప్రసాద్, ఆశారాజు, కిషోర్, రవి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీ నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటియుసి, సిఐటియు నాయకులు కోరారు. బుధవారం స్థానిక కామ్రేడ్ సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణకు నిర్వహించే సమ్మెను ప్రతి ఒక్కరు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి చింతలూరు సత్యనారాయణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ సి పి రెడ్డి, కార్మిక సంఘాల నాయకులు సురేష్, రేపాని కొండ, పి రజిని తదితరులు పాల్గొన్నారు. ఈనెల 20వ తేదీన జరుగు దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో గుడివాడ రూరల్ మండలం మల్లాయపాలెం పంచాయతీ కార్మికులు కూడా పాల్గొంటారని తెలుపుతూ పంచాయతీ కార్యదర్శి భట్రాజు కోటయ్య సమ్మె నోటీసును అందజేశారు. ఈ సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని, పంచాయతీ కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ సి పి రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు రేపాని కొండ, మల్లాయపాలెం పంచాయతీ కార్మికులు తిరుమలరావు, దుర్గారావు, కుమారి, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి:** చల్లపల్లి మండల పరిధిలోని చల్లపల్లి లక్ష్మీపురం గ్రామపంచాయతీ కార్యదర్శులకు మే 20వ తారీకు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నోటీసుని పంచాయతీ కార్మికులు ప్రజా సంఘాల నాయకులతో కలిసి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు కనకాల ప్రసాద్, సహాయ కార్యదర్శి శాంతల జయలక్ష్మి, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

19న ఇళ్ల స్థలాల సమస్యపై ధర్నాలు

ప్రజాశక్తి-మొవ్వ: పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇళ్ల నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేయాలని కోరుతూ ఈ నెల 19న సిపిఐ ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ సమితి సభ్యుడు లింగమనేని వెంకటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వంద మందికి అన్నదానం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: మచిలీపట్నంకు చెందిన సాయి అవనీష్ ఇటీవల తమిళనాడు ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బీటెక్ చదువుతూ ప్రమాదవశాత్తు చనిపోయాడు. కుమారుడి జ్ఞాపకార్థం సాయి తల్లిదండ్రులు కురిచేటి బాల వెంకటకృష్ణమూర్తి లక్ష్మీ స్వప్న దంపతులు బుధవారం సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంద మందికి అన్నదానం చేశారు. 18 ఏళ్ల సాయి ఆవినాష్ బందరులో ఉండగా సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యం జరిగే పేదల ఆహార పంపిణీలో పాల్గొని వడ్డన చేసేవారని నిర్వాహకులు



చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు ఉస్మాన్ బాష, మహిళా విభాగం అధ్యక్షురాలు కోన వెంకటేశ్వరమ్మ, వరప్రసాద్ దంపతులు పాల్గొన్నారు



వాటర్ కూలర్ బహూకరణ

ప్రజాశక్తి-మొవ్వ: వేసవి శిక్షణా తరగతులు జరుగుతున్న సందర్భంగా మొవ్వ శాఖ గ్రంథాలయానికి బుధవారం మండవ బుజ్జి కోటేశ్వరరావు కుమార్తె లక్ష్మీ తులసి జ్ఞాపకార్థం వాటర్ కూలర్‌ను బహుకరించారని గ్రంథాలయ అధికారి టి.కృష్ణకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో తుమ్మల గౌతం, దేప్ప, మండవ కోటేశ్వరరావు, మండవ రవికిరణ్, పిచ్చేశ్వరరావు, వెంకటరావు, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, వీరభద్రరావు, తుమ్మల నాగభూషణం, ఈడే నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: వేసవి శిక్షణా తరగతుల ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు పేర్కొన్నారు. బుధవారం ఈడేపల్లి గ్రంథాలయంలో విద్యార్థుల పఠనాసక్తిని పరిశీలించారు. పిల్లలు స్నేహితులతో మమేకమై, కొత్త స్నేహితులను ఏర్పరచుకుని సామాజిక నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. పిల్లలలో ఆత్మవిశ్వాసం పెరిగి, సవాళ్లను ఎదుర్కొని విజయవంతంగా ముందుకు సాగినప్పుడే వారి భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో 45 డివిజన్ టిడిపి ఇంచార్జ్ ఫణికుమార్, ఈడేపల్లి శాఖ గ్రంథాలయ నిర్వాహకురాలు కోన వెంకటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు హరి, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** ఆపద సమయాల్లో ఆదుకున్నవాడే నిజమైన స్నేహితుడని గ్రంథాల అధికారిని టి.వాణి అన్నారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరులో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు బాలమిత్ర కథల నుంచి ఇద్దరు మిత్రులు కథను చదివించడం జరిగింది. అనంతరం క్రాఫ్ట్ వర్క్, కాగితం పువ్వులు తయారు చేయడం నేర్పించారు. అనంతరం ఖోఖో ఆటల పోటీలు నిర్వహించారు. **పామర్రు:** మండల పరిధి జమీగొల్వేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా విద్యార్థులకు చరిత్ర, సంస్కృతి, విద్య విషయం, సమకాలీన సామాజిక విషయాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు ఎన్. మాధవి మాట్లాడుతూ విద్యార్థులు దేశ చరిత్ర, సంస్కృతిని గురించి సామాజిక రాజకీయ విషయాలపై అవగాహన, విద్యా సంబంధ విషయాలపై స్పృహ, సాంకేతిక విద్య పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్ తదితరులు పాల్గొన్నారు. పామర్రు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శ్రీకాకులపు రవితేజ ఆధ్వర్యంలో కంప్యూటర్ పరిజ్ఞానం నందు శిక్షణ ఇచ్చారు.


పామర్రులో...

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎం ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు. **కంకిపాడు :**కంకిపాడు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనము, కథలు చదివి వినిపించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు సిహెచ్ రామకృష్ణ, ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


గుడ్లవల్లేరులో...


కంకిపాడులో...

కొండలమ్మను దర్శించుకున్న మంత్రి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న కొండలమ్మ అమ్మవారిని రాష్ట్ర మంత్రి కొల్లి రవీంద్ర, యలమంచిలి నియోజకవర్గం జనసేన పార్టీ ఎమ్మెల్యే సుంకరపు విజయ్‌కుమార్ బుధవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు.



గేట్లు పునర్నిర్మించాలి

ప్రజాశక్తి-కోడూరు: కోడూరు అవుట్ పాల్స్ స్లూయిజ్ పునర్నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని రైతులు కోరుచున్నారు. అవుట్ పాల్స్ గేట్లు తుప్పు పట్టి విరిగిపోవడంతో కృష్ణానది నుంచి సముద్రపు ఉప్పునీరు నేరుగా పంట పొలాలలోకి చేరుతుందని ఆందోళన చెందుతున్నారు. ఉప్పునీరు నేరుగా పంట పొలాలలోకి చేరుట కారణంగా ఈ సంవత్సరం నారుమడి దశలోనే రెండుసార్లు మునిగి తీవ్రంగా నష్టపోయామని తెలిపారు. గతంలో తాత్కాలిక ఫైబర్ గేట్లు ఏర్పాటు చేస్తానని ఇరిగేషన్ అధికారులు తెలిపారని, ఫైబర్ గేట్లైన వెంటనే అమర్చి ఉప్పునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



సిసిఆర్‌సి కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-కోడూరు: కోడూరు మండల పరిధిలోని కౌలు రైతులు సిసిఆర్‌సి కార్డు పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని తహసిల్దార్ శ్రీను నాయక్ తెలిపారు. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే సిసిఆర్సి కార్డ్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ కార్డు పొందడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట భీమా ఇన్సూరెన్స్, ఇన్పుట్ సబ్సిటి, సబ్సిడీ విత్తనాలు, పంట కనీస మద్దతు ధరకు అమ్మకానికి అనుమతులు వస్తాయన్నారు. ఈ కార్డు పొందటానికి భూమి యజమాని పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, కౌలుదారు ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, మొబైల్ నెంబర్, సొంత భూమి గల వారి దగ్గర నుంచి రెవెన్యూ బాండ్ పేపర్ మీద 11 నెలలు పంట పండించుకునేందుకు ఒప్పంద పత్రం రాసుకుని రావాలని తెలిపారు.


రామాలయంలో అన్న సమారాధన

ప్రజాశక్తి-పామర్రు: పామర్రు ఎన్టీఆర్ కాలనీలోని శ్రీ కోదండ రామాలయం 3వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వ్యాపారవేత్త బొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మన్ వల్లూరుపల్లి గణేష్, జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, టిడిపి జిల్లా సహాయ కార్యదర్శి పరసా సుబ్రహ్మణ్యం, మంతెన రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



స్టాక్ పాయింట్ పరిశీలన

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్‌లో భాగంగా జిల్లా స్టాక్ పాయింట్ అయిన స్థానిక చిలకలపూడి పాండు రంగ మున్సిపల్ హైస్కూల్‌ను సమగ్ర శిక్ష ఎపిసి కుముదిని సింగ్ బుధవారం పరిశీలించారు. అలాగే ఆక్స్ఫర్డ్ డిక్షనరీస్ క్వాలిటీ మరియు క్వాంటిటీ పరిశీలించారు. మరియు పిఎంశ్రీ స్కూల్ గ్రౌండ్, కెమిస్ట్రీ లాబొరేటరీ మరియు కిచెన్ షెడ్ పనులు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మరియు సమగ్ర శిక్ష సీఎంఓ రమేష్, ఏఎంఓ శ్యామ్, ఐఇ కోఆర్డినేటర్ రాంబాబు, ఏపీవో ఏడుకొండలు పాల్గొన్నారు.





ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న రాంప్రదీప్

బాల్య వివాహాలు చేయొద్దు

ప్రజాశక్తి - తిరువూరు : బాలికలను ప్రాథమిక విద్య స్థాయిలోనే ఆపకుండా ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలని, వారికి చిన్న వయసులో వివాహం చేయవద్దని గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎం.రాంప్రదీప్ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన గానుగపాడు శివారులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక కార్మికులతో మాటామంతి కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు బడిలో ఉండాలని, పెద్దలు మాత్రమే పనికి వెళ్లాలని ఆయన సూచించారు. బాల్య వివాహాల వల్ల పిల్లలు అనారోగ్యం పాలౌతారని, ఉన్నత విద్య ద్వారా వారికి మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని వివరించారు.



విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - మైలవరం :

మైలవరం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా బుధవారం ఎస్ఎస్‌కె ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సామాజిక శాస్త్రం ఉపాధ్యాయులు ఎం.ప్రకాష్ బాబు సామాజిక శాస్త్రంలో భారతదేశ చరిత్ర ప్రాచీన భారతదేశంలో సాంస్కృతిక భౌగోళిక శాస్త్రంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చరిత్రను తెలుసుకోవాలని తద్వారా మరోచరిత్రను సృష్టించొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ప్రత్యేక రైల్వే అవగాహనా తరగతులు

ప్రజాశక్తి -విజయవాడ అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూనిఫైడ్ పెన్షన్, స్కీమ్ నూతన పెన్షన్ విధానాలపై అవగాహన కల్పించేందుకు సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యాన విజయవాడ డివిజన్ సంఘ్ కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అవగాహన తరగతులు బుధవారం విజయవంతంగా ముగిశాయి. సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ అల్లం రమేష్ తన టీంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు నాగశయన, రవికుమార్ తరగతులను బోధించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి కర్నూల్ సుకుమార్, ఇంజనీరింగ్ బ్రాంచ్ కార్యదర్శి ఎంఎస్‌రావు, కార్యవర్గ సభ్యులు నవీన్, లాజరస్, మణికుమార్, బి.వెంకటేశ్వరరావు, మదర్ పాల్గొన్నారు.



రెడ్డిగూడెంలో మాక్‌డ్రిల్

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ జె.సుశీలా దేవి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం విసన్నపేట ఫైర్ స్టేషన్ సిబ్బంది వారు రెవెన్యూ, పంచాయితీరాజ్, వైద్య, వ్యవసాయ, ఐకెపి సిబ్బంది, ప్రజలతో కలిసి మాక్ డ్రిల్ డెమో నిర్వహించి అందరికీ అనుకోకుండా గ్యాస్‌తో మంటలు చెలరేగినపుడు మహిళలు, కుటుంబ సభ్యులు మంటలు ఎలా ఆర్పాలి, ఒకవేళ చేతులు ఇతర శరీర భాగాలు మంటల్లో కాలితో ఎలా రక్షించుకోవాలనే 10 రకాల విధానాలపై ఫైర్ సిబ్బంది స్వయంగా వారి సిబ్బందితో మాక్ డ్రిల్ రూపంలో చూపించారు. అక్కడ ఉన్న అన్ని డిపార్ట్‌మెంట్‌ల సిబ్బందితో ముఖాముఖి జరిపారు. సదరు కార్యక్రమంలో ఎంపిడిఒ రమణ, డాక్టర్ మణిబాబు, డిప్యూటీ తహశీల్దార్ సతీష్ కుమార్, ఎఒ సురేష్ కుమార్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గంధం పుల్లయ్య, ఐకెపి ఎపిఎం రామకృష్ణ, ఎఇఒ పవన్, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయితీ కార్యదర్శిలు, విఎఎలు, ఎఎన్ఎంలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న తహశీల్దార్ సుశీలా దేవి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థల ప్రతినిధులు

20 నుండి గ్రంథాలయ కార్యశాల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వేసవి సెలవులను విద్యార్థి లోకం దుర్వినియోగం చేయకుండా ఆట, మాట, పాట, పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచుకునేందుకుగాను విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక, స్వేచ్ఛ ఆంధ్ర సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 20వ తేదీ నుండి గ్రంథాలయ కార్యశాల (వర్క్ షాప్) నిర్వహిస్తున్నట్లు బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు మనోహర్ నాయుడు, లక్ష్మయ్య తెలిపారు. ఈ కార్యశాలకు సంబంధించి బుధవారం సొసైటీ లైబ్రెరీలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. గ్రంథాలయాల పట్ల , తెలుగు మాతృభాష, పుస్తక పఠనం, రాయడం, కథలు చెప్పడం, ఆటలు, మ్యాజిక్ షో, సైన్స్ సందేహాల నివత్తి, నిఘంటువులు చదవడం వంటివి దీనిలో ఉంటాయని తెలిపారు. 6 నుండి ఇంటర్ విద్యార్థులు ఉదయం 9 నుండి 11, సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు జరిగే ఈ కార్యశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ సంచాలకులు ఏ.కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని వర్క్‌షాపును ప్రారంభి స్తారని గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీనర్ గోళ్ల నారాయణ రావు తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతి నిధులు వెంకట నారాయణ, రెహమాన్, అరసం అరుణకుమార్, శ్రీపతిరాయ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - వత్సవాయి : ఎపి గ్రామపంచాయితీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ – సిఐటియు గ్రామపంచాయితీ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శికి సిఐటియు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ పంచాయితీలో స్వీపర్స్, డ్రైనేజి క్లీనర్స్, వాటర్ వర్క్స్, ఎలక్ట్రిషియన్, డ్రైవర్లు తదితర విభాగాల్లో అనేక సంవత్సరాలుగా కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. వీరు గ్రామాల్లోని ప్రజలకు పారిశుధ్యం, ప్రజారోగ్యం రక్షణలో విశేషమైన సేవలందిస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలతో వేతనాలు చాలక కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.10,500ల వేతనంతో జీవనం గడవటం కష్టంగా ఉందని తెలిపారు. వివిధ విభాగాల్లో పనిచేసే కార్మికులకు వేతనాలను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఉన్న వేతనాల కమిటీ నిర్ణయిస్తుంది. అందులో భాగంగా ఆర్సి నెం: ఎ/1102/2023, 8 ఆగష్టు 2023 ద్వారా 2023–2024 సంవత్సరాలకు కనీస వేతనాలను నిర్ణయించారన్నారు. దాని ప్రకారమే రోజుకు అన్‌స్కిల్డ్ వర్కర్లకు రూ.596లు, సెమిస్కిల్డ్ వర్కర్లకు రూ.716లు, స్కిల్డ్ వర్కరు రూ.835లకు తగ్గకుండా చెల్లించాలని ఆదేశించారు. కానీ వీటి ప్రకారం కార్మికులకు జీతాలివ్వడం లేదని అన్నారు. కార్మికులందరికీ యూనిఫామ్, చెప్పులు, సబ్బులు, నూనెలు వంటివి తప్పనిసరిగా అందించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు జీతాలు పెంచకపోతే, కార్మికులందరినీ కలుపుకొని సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పెనుగంచిప్రోలు మండల కార్యదర్శి ధార నాగేశ్వరరావు, పంచాయతీ కార్మికులు వీరబాబు, రాంబాబు, సుందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ :

20న దేశవ్యాప్తంగా కార్మిక వర్గం చేస్తున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు నాయకులు, సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు విజ్ఞప్తి చేశారు. సిఐటియు విజ్ఞప్తి మున్సిపల్ కార్మికులకు స్కిల్, సెమి స్కిల్ వేతనాలు సక్రమంగా అమలు చేయాలని కోరుతూ మే 20న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మున్సిపల్ రంగ కార్మికులు సమ్మెలో భాగం కావాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు నాయకులు, సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు బుధవారం విజయవాడ నగర పాలక సంస్థ 39, 50, 51, 52 డివిజన్ల కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యబాబు, సర్కిల్ వన్ కార్యదర్శి వి.సాంబశివరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు సూరిబాబు, పశ్చిమ నియోజకవర్గ మున్సిపల్ రంగ కార్మిక నాయకులు వేల్పుల సాంబశివరావు, చెన్నా జగదీష్, కలపాల ప్రసాద్, సింగంపల్లి శ్రీను, బోరిశెట్టి పద్మ, చెన్న కొండమ్మ, మారేపూడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** కార్మికుల హక్కులు, కనీస వేతనం, స్కీం, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల పర్మినెంట్, బిల్డింగ్, ఆటో, ముఠా, రవాణా రంగ సంక్షేమ బోర్డు కై జరిగే దేశవ్యాప్త జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కొండపల్లి పారిశ్రామిక వాడ లోని పలు యూనియన్స్ సర్వ సభ్య సమావేశాలు నిర్వహించాయి. ఈ సమావేశాల్లో విస్తతంగా కరపత్రాల ప్రచార పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.మహేష్, సిఐటియు హెచ్‌పిసిఎల్ ఆయిల్ సెక్టార్ నాయకులు రాజశేఖర్, శేఖర్, బాబు నాయక్, గాంధీ, పిచ్చయ్య, కోటి, వెంకటేశ్వరరావు, హెచ్‌పిసిఎల్ ఆయిల్ సెక్టార్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు సుందరరావు, శేషగిరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. **వత్సవాయి :** వత్సవాయి మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో సిఐటియు జిల్లా నాయకులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.రాము సిఐటియు నాయకులు వై.వెంకటేశ్వర్లు, డి.శైలజ, మెరమ్మ, ప్రసాదు, రాజేశ్వరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. **జి.కొండూరు :** 20న దేశవ్యాప్తసమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ జి.కొండూరులో ఆటోవర్కర్స్ యూనియన్, ఆశ వర్కర్స్ పంచాయితీ వర్కర్స్ యూనియన్ కలిసి సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కరపత్రాలు ద్వారా విస్తృత ప్రచారం కల్పించారు. ఈ కార్యక్రమంలో జి.కొండూరు సిపిఎం శాఖా కార్యదర్శి ప్రసాద్, సిపిఎం కార్యకర్త బాబురావు తదితరులు పాల్గొన్నారు. **నందిగామ :** మే 20 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ పేర్కొన్నారు. నందిగామ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు కరపత్రాలు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సి ఐటియు జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడారు. ఇంజనీరింగ్ కార్మికులు సమస్యలు పరిష్కారం కాకపోతే జూన్ 1 నుండి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం నాయకులు కండెల శ్రీను, పరిమి రవి, దాసు, శ్రావణ్, బ్రహ్మం కార్మికులు పాల్గొన్నారు. **తిరువూరు :** సివిల్ సప్లై ముఠా కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ అనూష్ కుమార్‌కు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బలగాని వెంకటేశ్వరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై ముఠా కార్మికుల యూనియన్ నాయకులు మరకాల ప్రకాశరావు, ఇజ్రాయెల్, రాము, అలవాల వెంకట్ పాల్గొన్నారు.



50వ డివిజన్‌లో కార్మికులతో సత్యబాబు



ఇబ్రహీంపట్నంలో కాంట్రాక్టు కార్మికులతో ఎన్‌సిహెచ్



తిరువూరులో...



నందిగామలో...

మెగా జాబ్ మేళాలో 257 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుడివాడ : నైపుణ్యాభివద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎఎన్ఆర్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించినట్లు జిల్లా ఉపాధి అధికారి డి. విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి పి.నరేష్ కుమార్‌లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, ఎమ్ఆర్ఎఫ్ లిమిటెడ్, ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్సు, గోదావరి కష్ణ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్, సుధీర్ టింబర్స్ ప్రైవేట్ లిమిటెడ్, కురాకు ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, మెడ్ఫస్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, పేటిఎమ్, వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, మోహన్ స్పింటెక్స్ ఇండియా లిమిటెడ్,



నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులతో ఉపాధి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సభ్యులు, కళాశాల సభ్యులు

సిఎంఆర్ షాపింగ్ మాల్, ప్రాంప్ట్ పర్సోన్నెల్ ప్రైవేట్ లిమిటెడ్, క్వెస్ కార్ప్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 475 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వారిలో 183 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని అలాగే 74 మంది ఫైస్థాయి ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో, కళాశాల ప్రిన్సిపాల్ పి.జె.ఎస్.కుమార్, కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.ఆర్.కె. ప్రసాద్, కె.ఎస్.అప్పారావు, కోశాధికారి పర్వతనేని కష్ణ ప్రసాద్, నైపుణ్యాభివద్ధి సంస్థ జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ తుర్లపాటి మధు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్.పద్మజ, ప్లేస్మెంట్ ఆఫీసర్ వి.నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న హరిహరనాథ్

వ్యాపారవేత్తలను తీర్చిదిద్దేందుకు కృషి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో జీవనోపాధుల కార్యాచరణ ప్రణాళికను సమన్వయంతో సమర్థవంతంగా అమలుచేసి ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్తను తయారు చేసేందుకు కృషి చేయాలని డిఆర్‌డిఎ పీడీ వై. హరిహరనాథ్ సూచించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ సమావేశాల్లో ఏపీఎంలు, సిసి, లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రతి ఇంటిలోనూ ఒకరిని వ్యాపారవేత్తగా తీర్చిదిద్దేందుకు కత నిశ్చయంతో ఉందన్నారు. కాబట్టి అందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి ఒక గ్రామం చొప్పున ప్రధానంగా 7 గ్రామాలను ఎంపిక చేసి ప్రయోగా త్మకంగా ఎంపిక చేయడం జరిగిందని ఆ ప్రకారం ఆయా గ్రామాలను నూటికి నూరు శాతం పూర్తిస్థాయిలో జీవనోపాదులు కల్పించి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేల కషి చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డి పి యం ఐ బి ఎన్.సత్యభామ ,డి. పి. యం బ్యాంక్ లింకేజ్, పి.కనకరావు, డి పి యం హెచ్ ఆర్ జి.రవి బాబు,డి పి యం ఇన్స్యూరెన్స్,విజేత, జిల్లా సమాఖ్య సెక్రెటరీ వి. బంగారమ్మ పాల్గొన్నారు.

క్రిమిటోరియం ప్రారంభం


ప్రజాశక్తి-గుడివాడ: జిల్లాలో ఎక్కడా లేనివిధంగా గుడివాడ పట్టణంలో రోటరీ క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో అన్ని వసతులతో కూడిన వైకుంఠ ప్రస్థానాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కమిషనర్ సింహాద్రి మనోహర్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని రోటరీ వైకుంఠ ప్రస్థానంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ



ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్యాస్ బేసిడ్ పోర్టబుల్ క్రిమటోర్ సిస్టమును మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలను ఉద్దేశించి మాట్లాడారు. కమీషనర్ మనోహర్ మాట్లాడుతూ నూతన పరికరాల వలన పుర ప్రజలకు ఎంతో ఖర్చు తగ్గుతుందని, ఈ విషయాన్ని ప్రజలందరికి తెలియజేస్తామని, మిగతా పురపాలక సంఘాలలో ఇటువంటి నూతన క్రిమటోర్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం రోటరీ క్లబ్ సభ్యులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ అధ్యక్షుడు రాజశేఖర్, క్లబ్ కౌన్సిలర్ బాబు శ్రీకర్, సెక్రెటరీ కిరణ్ బాబు, కమ్యూనిటీ సర్వీస్ ట్రస్ట్ సెక్రటరీ రామ కష్ణ, పలువురు రోటరీ క్లబ్ సభ్యులు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

ప్రజాశక్తి-ఘంటసాల: సమాజానికి మేలు చేయాలనే భావన స్ఫూర్తిదాయకమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం సాయంత్రం ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళంలో కొండవీటి పాండురంగారావు - సీతారావమ్మ జ్ఞాపకార్థం సుగ్గన సురేంద్ర - మాధవి దంపతుల ఆర్థిక సౌజన్యంతో



జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు సుగ్గన పవన్ కుమార్ పర్యవేక్షణలో నిర్మించిన నూతన బస్ షెల్టరును ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్ షెల్టర్ నిర్మాణ దాతలు వారిని ఘనంగా సత్కరించారు. కరకట్టపై ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు షెల్టర్ నిర్మించిన దాతలను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), సిద్ధినేని కుమార్ రాజా, నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు.



శ్రీ కృష్ణదేవరాయల మహోత్సవం

ప్రజాశక్తి-ఘంటసాల: శ్రీకాకుళం గ్రామంలోని శ్రీకాకుళేశ్వర స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో శ్రీకృష్ణదేవరాయల మహోత్సవం సందర్భంగా బుధవారం శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి జస్టిస్ దుర్గాప్రసాద్, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీ కృష్ణ దేవరాయల మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, మండలి వెంకట్రాం, ఏఎంసి చైర్మన్ తోట కనకదుర్గ, డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, సర్పంచ్ రవి ప్రసాద్, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్న), ప్రత్యేక అధికారి సాయిబాబు, తహసీల్దార్ విజయప్రసాద్, ఎంపీడీఓ సుబ్బారావు పాల్గొన్నారు.

ఎఎంసి చైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ: దివి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా నియమితులైన కొల్లూరి వెంకటేశ్వరరావును అవనిగడ్డ నియోజకవర్గ ఎస్‌సి నాయకులు ఘనంగా సత్కరించారు. బుధవారం నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద మోపిదేవి మండలం గ్రామానికి చెందిన ఎస్సీ నాయకులు డోకిపర్తి బాలకోటేశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, నాయకులు మేడికొండ విజయ్ తదితరులు వెంకటేశ్వరరావును శాలువా పూలదండలతో సత్కరించారు.

సరస్వతీ నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభం కానున్న సరస్వతీ నది పుష్కరాలకు కాలేశ్వరం పుణ్యక్షేత్రానికి అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుండి సూపర్ లగ్జరీ బస్సు సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపారు. బుధవారం ఆయన డిపో కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఈ బస్ సర్వీసులు 21వ తేదీ సాయంత్రం 8 గంటలకు అవనిగడ్డలో బయలుదేరి ఉదయం కాలేశ్వరం చేరుతుందని, అక్కడ సరస్వతీ నది పుష్కర స్నానం ఆచరించి అనంతరం కాళేశ్వరుని దర్శనం రామప్ప దేవాలయం, వరంగల్ నగరంలోని వెయ్యి స్తంభాల గుడి భద్రకాళీ దేవాలయం సందర్శించుకుని 23వ తేదీ ఉదయం అవనిగడ్డకు చేరుతుందని తెలిపారు. ఈ బస్సుకు ఒక్కొక్కరికి రూ.2 వేలు ఛార్జీ వసూలు చేయబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని దివి సీమలోని యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంత్రి పయ్యావుల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గుడివాడ: ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, యలవర్తి సేనల ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థిక, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ 60వ పుట్టినరోజు వేడుకలను పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పుట్టినరోజు కేక్‌ను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు కూటమి నేతలతో కలిసి కట్ చేశారు. అనంతరం వంద మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం నెహ్రూ చౌక్ సెంటర్లో వేసవి మజ్జిగ పంపిణీ శిబిరం ప్రారంభించి బాటసారులకు మజ్జిగ అందించి, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లోని రోగులకు పండ్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. బైపాస్ రోడ్డులోని మమతా వద్ధాశ్రమంలోని వద్ధులకు యలవర్తి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో చీరలను పంపిణీ చేసి, మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో వద్ధులను యలవర్తి కుటుంబ సభ్యులు యలవర్తి


వస్త్రాలను పంపిణీ చేస్తున్న రావి, యలవర్తి

కనకదుర్గ, యలవర్తి సరళలు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగ ప్రసాద్, టిడిపి నాయకులు డాక్టర్ గోర్జి సత్యనారాయణ, బిజెపి కన్వీనర్ దావులూరు సురేంద్రబాబు, ఏపీ కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, టిడిపి నాయకులు గుత్తా చంటి, మాజీ కౌన్సిలర్లు వసంతవాడ దుర్గారావు, శొంటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధికి ఎపి అనుకూలం : పురందేశ్వరి



ప్రజాశక్తి-గన్నవరం (హనుమాన్ జంక్షన్): పరిశ్రమలు ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల వాతావరణ ఏర్పడిందని రాజమండ్రి ఎంపీ, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బాపులపాడు మండలం మల్లవల్లి పారిశ్రామిక వాడలో ఫోక్స్ ఆపిరల్స్ నిర్మాణానికి బుధవారం సాయంత్రం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తో కలిసి భూమి పూజ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్లు అప్పటి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను ఎన్నో వేధింపులకు గురి చేయటంతో వారిలో ఎక్కువమంది ప్రభుత్వ వేధింపులు భరించలేక రాష్ట్రం నుండి పారిపోయారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణ ఏర్పడిందని పేర్కొన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడకు రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో తీర్చిదిద్దేందుకు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శక్తి వంచన లేకుండా కషి చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని ఎక్కువ మంది పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు దశరథ జనార్దన్, మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ, ఏపీయస్సాయేమ్ఈ చైర్మన్ శివశంకర్, చిగురుపాటి కుమార్ స్వామి, తుమ్మల అంజిబాబు, ముల్పూరి సాయి కళ్యాణి, దయ్యాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్ పాల్గొన్నారు.

ఆర్ఎంపిల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా : వర్ల

ప్రజాశక్తి-పామర్రు: గ్రామీణ ప్రాంతాలలో ఆర్ఎంపీ వైద్యులు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమైనవని వారి సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ఆర్.ఎం.పి వైద్య సంఘాల నాయకులు స్థానిక టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఎంపి వైద్య బృందం నాయకులు మాట్లాడుతూ బేసిక్ హెల్త్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ (బిహెచ్ఎంపిఏ)ఆంధ్ర ప్రదేశ్ ప్రాథమిక వైద్య సంఘాల పిలుపుమేరకు తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి లంక దాసరి ప్రసాదరావు సారధ్యంలో గత కొన్ని రోజులుగా శాసనసభ్యులకు వినతి పత్రాలు ఇవ్వటం జరుగుతోందన్నారు. అందులో భాగంగా బుధవారంపామర్రు శాసనసభ్యులు వర్ల కుమార రాజా ను కలిసి గ్రామీణ వైద్యుల సమస్యలపై వినతి పత్రం ఇచ్చామని తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేను కోరా మన్నారు . ఈ కార్యక్రమంలో బిహెచ్ఎంపిఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు నందూరి ఉమాశంకర్, సంయుక్త కార్యదర్శి కోలా వెంకటేశ్వరరావు, ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షులు సాగిరాజు ఉదయభాస్కరరాజు వర్కింగ్ ప్రెసిడెంట్ గుదే నాగ చంద్రశేఖర్ (నాని) గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగిపోగు కోటేశ్వరరావు, గుడివాడ ఏరియా ఆర్ఎంపి నాయకులు పి లక్ష్మణరావు, మైనీడి వెంకటేశ్వరరావు, మంతెన ఇంద్రాణి, రాజశ్రీ, సునంద తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ఆర్ఎంపిలు

బ్యాడ్మింటన్ కోచ్‌కు అభినందనలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : 2025లో బిహార్‌లో జరిగిన ఖేలో ఇండియా యువత గేమ్స్‌లో బ్యాడ్మింటన్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు బంగారు పతకం సాధించింది. జగ్గయ్యపేటకు చెందిన (ఎస్ఎపి) బ్యాడ్మింటన్ కోచ్ కీసర గోపి ఆంధ్రాజట్టుకు కోచ్‌గా వ్యవహరించారు. ఆయన ఆధ్వర్యంలో జట్టు అత్యుత్తమ ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు ఈ విజయం గర్వకారణంగా మారింది. జట్టు విజయానికి ముఖ్య కారణంగా కోచ్ కిసారా గోపి మార్గదర్శకత, క్రీడాకారుల కృషి, శిక్షణతో ఇది సాధ్యమైంది.



ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి మైలవరం : మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్, మోస్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మదర్ తెరిసా ట్రస్ట్ కార్యాలయంలో వివిధ కోర్సులలో ఉచిత శిక్షణ బుధవారంతో ముగిసింది. అనంతరం ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మోస్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్నారి భూక్య హారిణికి రూ.పదివేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మోస్ట్ గౌరవాధ్యక్షులు కాటమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉచిత శిక్షణా తరగతులు మహిళల ఆర్థిక అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మోస్ట్ జాయింట్ సెక్రెటరీ వసుకుమార్, సక్కుర్తి విజయలక్ష్మి, జూలకంటి ప్రసాద్, ద్రోణవల్లి విజయలక్ష్మి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చలవారి మధుసూదన్‌రావు, మన్నే శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అందాల పోటీలపై పిఒడబ్ల్యు నిరసన

ప్రజాశక్తి - విజయవాడ : మహిళలను శరీరాల ద్వారానే గుర్తిస్తూ వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా హైదరాబాదులో జరుగుతున్న 72వ ప్రపంచ సుందరి పోటీలను వ్యతిరేకిస్తూ బుధవారం ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యూ) ఆధ్వర్యాన విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని నిరసన తెలిపారు. తెలంగాణా ప్రభుత్వ మహిళా వ్యతిరేక వైఖరిని ఖండిస్తూ ఉద్యమించిన మహిళ నాయకులను లాఠీచార్జి చేసి అరెస్టు చేయడమే కాకుండా పిఒడబ్ల్యు జాతీయ నాయకులు సంధ్యక్కను అక్రమంగా గృహ నిర్బంధం చేయడాన్ని ఈ సందర్భంగా నేతలు ఖండించారు.

అధికార లాంఛనాలతో పోలీసు డాగ్ 'మిక్కి'కి అంత్యక్రియలు

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్లో సుమారు 11 సంవత్సరాల పాటు స్నిపర్ డాగ్‌గా విశేష సేవలందించి బుధవారం వయసురీత్యా పోలీసు డాగ్ మిక్కీ (14) తుదిశ్వాస విడిచింది. నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు మిక్కి మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. మిక్కి భౌతిక కాయానికి అడ్మిన్ డిసిపి కె.జి.వి.సరిత, సిఎస్‌డబ్ల్యూ డిసిపి ఎస్.వి.డి.ప్రసాద్, ఎసిపి కష్ణం రాజు, ప్రేమ్ కుమార్ తదితరులు పోలీసు డాగ్ మిక్కి పార్థీవ దేహానికి పూల మాలల వేసి నివాళులర్పించారు. అనంతరం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.



రేషన్ కార్డు దరఖాస్తులకు మ్యారేజి సర్టిఫికెట్ ఆప్షనల్‌గా ఇవ్వాలి

ప్రజాశక్తి - విజయవాడ : కొత్తగా రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునే వారికి మ్యారేజ్ సర్టిఫికేట్ ఆప్షనల్‌గా పెట్టాలని కోరుతూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నగర కమిటీ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జిల్లా డిఆర్ఓ ఎం లక్ష్మీనరసింహంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు కంచర్ల భార్గవ్, నాయకులు లంకే సాయి, షేక్ అబ్దుల్ ఖాయుమ్ పాల్గొన్నారు..

వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని ముఖ్య ప్రదేశాల్లో బుధవారం పోలీసులు హెల్మెట్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు. భవానీపురం సితారా సెంటర్, గొల్లపూడి, ఒన్‌టౌన్ అమ్మ హోటల్ సెంటర్, టూటౌన్ పాముల కాలువ సెంటర్, నున్న భవానీబార్, కండ్రిక ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. జగ్గయ్యపేట ఎన్‌టిఆర్ సర్కిల్, కంచికచర్ల, మైలవరం తదితర ప్రాంతాల్లో పోలీసు అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించి, వాహనదారులకు



హెల్మెట్ అవశ్యకతపై అవగాహన కల్పించారు. వాహనదారులు భద్రతా నియమాలు పాటించి పోలీసులకు సహకరించాలని ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ రాజ శేఖర బాబు కోరారు.

లా నేస్తం పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి - విజయవాడ : నూతనంగా ఎన్నికైన బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎకె బాషా, ప్రధాన కార్యదర్శి కెవి.రంగారావు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి 'న్యాయవాదుల రక్షణ చట్టం, జూనియర్ న్యాయవాదుల లా నేస్తం' అమలు పరచాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై గవర్నర్ సానుకూలంగా స్పందించి వినతిపత్రాలను ప్రభుత్వం వారికి అందించి వీలైనంత త్వరగా అమలుపరిచేలా చూస్తామని చెప్పారు. నూతనంగా ఎన్నికైన బెజవాడ బార్ గవర్నింగ్ బాడీనీ గవర్నర్ అభినందించారు.



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న భాను ప్రసాద్

జ్యూయలరీ కాటాలపై అవగాహన

ప్రజాశక్తి - నందిగామ : బంగారు జ్యూయలరీ కాటాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని జిల్లా లీగల్ మెట్రాలజీ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ భాను ప్రసాద్ పేర్కొన్నారు. బుధ వారం నందిగామలో బంగారు జ్యూయలరీ, బులియన్ మర్చంట్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం నందిగామ జ్యూయలరీ మర్చంట్స్ వ్యాపారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తూనికల కొలతల శాఖ జిల్లా లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ భాను ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ జువెలరీస్ అండ్ బులియన్ మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణారావు, జువెలరీస్ అసోసియేషన్ నాయకులు కిషోర్, ఖాదర్ మస్తాన్, పలువురు జ్యూయలరీస్ వ్యాపారులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు అగ్గిపెట్టెలో పట్టు చీర సమర్పణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ కనక దుర్గమ్మ వారికి చేనేత కార్మికులైన యాత్రికులు అగ్గిపెట్టెలో పట్టు చీర సమర్పించారు. బుధవారం తెలంగాణ రాష్ట్రం సిరిసిల్ల వాస్తవ్యుడైన చేనేత కళాకారుడు నల్ల విజయ్ కుమార్ తన తండ్రి నల్ల పరంధాములు వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని అగ్గిపెట్టెలో ఇమిడే పట్టు చీర తయారుచేసి అమ్మవారికి అందించారు. చీర బరువు100 గ్రాములు, దీని పొడవు ఐదున్నర మీటర్లు, వెడల్పు 48 ఇంచులు. దీనిని పూర్తిగా పట్టు దారాలతో, గోల్డ్ జరీ వాడామని, దీని తయారీకి సుమారుగా ఐదు రోజులు పట్టిందని నల్ల విజయ్ కుమార్ తెలిపారు. ఆలయ ఇఒ వి.కె.శీనా నాయక్ వీరిని అభినందించి, ప్రసాదం అందించారు.



అగ్గిపెట్టెలో చీరను అందజేస్తున్న విజయ్‌కుమార్

తగ్గిన మల్లెల గుభాళింపు

ధర లేక రైతు డీలా... - కలగానే మల్లెల మార్కెట్ హామీ



అమ్మేందుకు సిద్ధంగా ఉన్న మల్లె



చంద్రగూడెంలో మల్లెతోట

ప్రజాశక్తి - మైలవరం : మగువ మనసులు దోచే మల్లెల గుబాళింపు తగ్గింది. మల్లెలు శుభకార్యాలకు ప్రధాన ఆకర్షణ. ఈ పూలు లేకుండా తెలుగింటి సందడి కనిపించదు. వీటిని సుగంధ భరిత పదార్థాల తయారీలో విరివిగా ఉపయోగిస్తుంటారు. రైతులు సాగుకు ఆసక్తి చూపుతున్న తగిన ప్రోత్సాహం లేకపోవడంతో కలవర పడుతున్నారు. సాగుకు పెట్టుబడులు పెరగటం, రవాణా సౌకర్యం లేకపోవడం, దళారుల పెత్తనంతో, రైతులు నష్టపోతున్నారు. పాలకుల హామీలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. ఇక్కడ మల్లెల మార్కెట్ ఏర్పాటు హామీ కలగానే మిగిలింది.

చంద్రగూడెం ప్రసిద్ధి: మల్లె తోటల సాగుకు మైలవరం రాష్ట్రంలోనే పేరుగాంచింది. మండలంలోని చంద్రగూడెం కేంద్రంగా దాదాపు రెండు దశాబ్దాల కిందట సాగు ప్రారంభించారు. 30 ఎకరాలతో ప్రారంభమైన సాగు నేడు 1,500 ఎకరాలకు పైగానే చేరింది. అప్పటినుంచి రైతులే నేరుగా మార్కెటింగ్ చేసుకొని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసుకుంటున్నారు. రైతులు మల్లెలపై మక్కువ పెంచుకొని ప్రతికూల పరిస్థితులు అధిగమించి మల్లె తోటలను సాగు చేస్తున్నారు.

రోజుకు 10 టన్నుల పైగానే వ్యాపారం: చంద్రగూడెం ప్రధాన కేంద్రంగా రోజుకు పది టన్నులకు పైగానే మల్లెపూల వ్యాపారం జరుగుతుంది. పండుగలు, శుభ కార్యాలు సమయంలో రోజుకు 15 లక్షల నుండి 20 లక్షల వరకు వ్యాపారం జరుగుతుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. చంద్రగూడెంతో పాటు పుల్లూరు, కొత్తగూడెం, రెడ్డిగూడెం మండలం లోని పలు గ్రామాలకు చెందిన 400 మంది పైగానే రైతులు మల్లెలను తీసుకొచ్చి అమ్ముతుంటారు. కొంతమంది రైతులు నేరుగా హైదరాబాద్, రాజమండ్రి, తణుకు, భద్రాచలం, కొత్తగూడెం, నల్లగొండ, కడియపులంక, తిరువూరు, కోదాడ, సూర్యాపేట, ఏలూరు, భీమవరం, తదితర ప్రాంతాలకు నేరుగా కొంత మంది రైతులే మల్లెలను సరఫరా చేస్తుంటారు. రైతులు కాకుండా మరో 20 మంది దళారులు తక్కువ ధరకు రైతుల వద్ద కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఒక్కొక్కసారి దళారి చెప్పిందే నడుస్తుంది. మార్కెటింగ్ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో రైతు అందిన కాడికి దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పెరిగిన పెట్టుబడులు - తగ్గిన దిగుబడి : ఈ ఏడాది గతం కంటే పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. ఎకరానికి 60వేలకు [illegible] పెట్టుబడులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. ఫిబ్రవరి నెల నుండి అక్టోబర్ వరకు మల్లెలు వస్తూ ఉంటాయి. అధిక ఉష్ణోగ్రతలు ఉంటే మల్లె దిగుబడి బాగా వస్తుంది. ఈ ఏడాది గత రెండు నెలల్లో అకాల వర్షాలు, తెగుళ్ల రావడంతో మల్లె దిగుబడి తగ్గిందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కేజీ మల్లెపూలు 200 నుంచి 250 ధర ఉండటంతో గిట్టుబాటు కాదని రైతులంటున్నారు. దిగుబడి తగ్గిన ధర లేకపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు..



కేజీ 300 ఉండాలి : చిలుకూరు చిట్టిబాబు రైతు పుల్లూరు

మల్లెపూలు కేజీ 300 ఉంటే గిట్టుబాటు అవుతుంది. రైతుకు నష్టం కూడా రాదు. రవాణా సౌకర్యం లేక దూర ప్రాంతాలకు పొద్దుపోయి చేరడంతో ఒక్కోసారి ధర పలకటం లేదు. మల్లెపూలు పచ్చి సరుకు. నిల్వ ఉండదు. కూలి రేట్లు బాగా పెరిగాయి.



దిగుబడి బాగా తగ్గింది : జొన్నలగడ్డ శ్రీనివాసరావు రైతు కొత్తగూడెం

వాతావరణం సక్రమంగా లేకపోవడంతో ఈ ఏడాది దిగుబడి బాగా తగ్గింది. ఒక ఎకరం సాగు చేశాను. దిగుబడి తగ్గటంతో పాటు ధర కూడా లేకపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

మార్కెట్ ఏర్పాటు చేయాలి : పివి ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

చంద్ర గూడెం కేంద్రంగా మల్లె వ్యాపారం ఎప్పటినుంచో జరుగుతుంది. మార్కెట్ సౌకర్యం ఉంటే పండించిన పంటను నేరుగా రైతే రవాణా చేయవచ్చు. దళారులు రైతును అందిన కాడికి దోచుకుంటున్నారు. గతంలో మంత్రిగా పనిచేసిన దేవినేని ఉమా చంద్రగూడెంలో మల్లె మార్కెట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అటు తర్వాత వచ్చిన పాలకులు కూడా హామీ ఇచ్చారు. ఇ చ్చిన హామీలను పాలకులు నిలబెట్టుకోవాలి. వెంటనే చంద్రగూడెంలో మల్లె మార్కెట్ను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.